క్లుప్తంగా

నారుమడుల యాజమాన్యంపై అవగాహన



కిత్తన్నపేటలో ఉభాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

లక్కవరపుకోట: వరి నారుమడుల యాజమాన్యంలో భాగంగా నారుమడుల్లో పురుగులు, తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలపై ఖాసాపేట, కిత్తన్నపేట గ్రామాల్లోని రైతులకు కొత్తవలస సబ్ డివిజన్ వ్యవసాయ సహాయకురాలు భానులత అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో పాలంపిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించి వరి ఉభాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్.కోట ఏఓ వి.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొద్దాం పాఠశాలకు పురస్కారం



బొద్దాం హైస్కూల్‌కు వచ్చిన పురస్కారాన్ని విద్యార్థులకు చూపిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

వేపాడ: మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా విద్యార్థులందరూ ఫస్ట్ క్లాస్‌లో పాస్ కావడంపై విద్యాశాఖ, కలెక్టర్ అభినందిస్తూ పురస్కారం అందించినట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులకావడంతో కలెక్టర్, రీజనల్ జాయింట్ డైరెక్టర్‌లు, జిల్లా విద్యాశాఖాధికారి చేతులమీదుగా పాఠశాలకు ప్రశంసాపత్రం అందించారని విద్యార్థులకు బుధవారం ప్రార్థనలో హెచ్‌ఎం వివరించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బల్లంకిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

వేపాడ: మండలంలోని బల్లంకి ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఈ మధ్య జరిగిన బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను సర్పంచ్, ఎంపీటీసీ, ఉపసర్పంచ్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. బదిలీపై వెళ్లిన జగదీష్, శ్రీను, శ్రీరాములు మాస్టార్లను సర్పంచ్ కనకరాజువరలక్ష్మి, ఎంపీటీసీ తులసితో పాటు పలువురు దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలభాస్కరరావు, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ



నోట్స్ పుస్తకాలతో విద్యార్థులు

వేపాడ: మండలంలోని సోంపురం, అరిగిపాలెం పాఠశాలల విద్యార్థులకు ఎస్.కోటకు చెందిన సాయి దివ్యామృతం సభ్యులు 240 నోట్స్ పుస్తకాలు అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం బీపీప రాజు తెలిపారు. సోంపురం, అరిగిపాలెం ప్రాథమిక పాఠశాలలో 1,2 తరగతులు చదువుతున్న విద్యార్థులతో పాటు సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఆ పుస్తకాలను అందచేశామన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు జి.పట్టాలు, వెంకటరమణ, ప్రసాద్‌ల సమక్షంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



బల్లంకిలో విద్యార్థులకు వడ్డన చేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: పాఠశాలలో చదువుతున్న వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ బాలభాస్కర రావు ఉపాధ్యాయులకు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన బల్లంకి ప్రాథమిక పాఠశాల, బానాది ఎంపీయూపీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించి విద్యార్థుల నోట్స్ పుస్తకాలను చూసి దస్తూరి మెరుగు పర్చుకోవాలని సూచించారు. బల్లంకిలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు ఎంఈఓ వడ్డన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యసేవలు

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రసన్న సర్జికల్ క్లినిక్‌లో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించారు. సుమారు 60మందికి వైద్య పరీక్షలు చేసి ఇద్దరికి కళ్లద్దాలు ఇచ్చి, నలుగురిని ఆపరేషన్ కోసం రిఫర్ చేశారు.

బాబు మోసం.. ప్రజలకు శాపం

- ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



వేపాడ: బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేతో పాటు మండల నాయకులు

వేపాడ: బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారంటీ అని బాబు రాసి ఇచ్చిన బాండు ప్రజలకు శాపంగా మారిందని పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని శృంగవరపుకోట మాజీ శాసనసభ్యుడు కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ వేపాడ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు నేతృత్వంలో వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో సంక్షేమపథకాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆడబిడ్డ నిధి అన్నదాత సుఖీభవ



జామి: కలగాడలో కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నిరుద్యోగి భృతి, ఉచిత బస్సు లాంటి పథకాలు అమలు జరిగాయా అంటూ గ్రామస్తులను ప్రశ్నించారు. ఇచ్చిన పథకాలే సక్రమంగా అందలేదంటూ పలువురు సమాధానమిచ్చారు. బాబు హామీలకు పేదప్రజలందరం మోసపోయామని వాపోయారు. కార్యక్రమంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ఎంపీపీ అడపా ఈశ్వర్రావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, మూకల కస్తూరి, దుల్ల మహేష్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులతో పాటు స్థానిక నాయకులు నిరుజోగి శ్రీను, వంటాకు భాస్కరరావు , ముత్యాలు నాయుడు, మిరపాక రమణ, దేబార్కి అప్పారావు, జేసీఎస్ మండల కన్వీనర్ బోజంకి శ్రీను, మండల యూత్ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జామిలో..

మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ జామి మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కలగాడ, శిరికిపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, కలగాడ సర్పంచ్ బాదిరెడ్డి సత్యవతి, పార్టీ నేతలు గుడివాడ రాజేశ్వరరావు, మండల ప్రచారకార్యదర్శి ఎస్.అప్పలరాజు, మజ్జి హరి, గేదెల రమణబాబు పాల్గొన్నారు.

మోసకారి చంద్రబాబును నమ్మొద్దు..



చీపురుపల్లి రూరల్(గరివిడి) : బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన మోసకారి చంద్రబాబును భవిష్యత్‌లో నమ్మొద్దని గరివిడి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో బుదవారం చంద్రబాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచినా నేటికీ ఏ పథకం కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, స్థానిక సర్పంచ్ బూడి శ్రీరాములు, వైస్ ఎంపీపీలు కె.రామకృష్ణరాజు, జి.శ్రీరాములనాయుడు, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీ లెంక శ్రీరాములు, సర్పంచ్ జి.తమ్మినాయుడు, ఎంపీటీసీలు యల్లంటి పోలీస్‌నాయుడు, రఘుమండ శ్రీదేవి, మాజీ సర్పంచు అలమండ అప్పలనాయుడు, ముద్దాడ రమణ గ్రామస్తులు పాల్గొన్నారు.

మోసాలు, అబద్ధాలే చంద్రబాబు పెట్టుబడి

- వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు



చిన్నరావుపల్లిలో ప్రజలకు చంద్రబాబు మోసాలపై వివరిస్తున్న నెక్కల నాయుడుబాబు తదితరులు

కొత్తవలస: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి మోసాలు,అబద్ధాలే పెట్టుబడులని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు ఆరోపించారు. ఈ మేరకు కొత్తవలస మండలంలోని చిన్నరావుపల్లి, కంటకాపల్లి, కాటకాపల్లి గ్రామాల్లో బూబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయుడుబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు నేరవేర్చని విషయాలపై వివరించారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రస్తుతం కూటమి నేతల పాలనకు వ్యత్యాసాలను తెలియజేశారు. చంద్రబాబునాయుడు హామీలు ఇస్తారే తప్ప అమలు చేయడం ఆయనకు తెలియదన్నారు. మోసాలతోనే పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఆడబిడ్డ పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్ముకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నమాటలను ఆయన ప్రస్తావిస్తూ నాడు హామీలు ఇచ్చినప్పుడు తెలియదా? అని ప్రశ్నించారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసేశాం. అమలు చేయలేదని ఎవరైనా అడిగితే చెంపచెళ్లుమన్నట్లు కొట్టండి అని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు బూసాల దేముడు, పీతల కృష్ణ, మదీనా అప్పలరమణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పార్టీ నాయకులు పల్లా భీష్మ, పీఎస్ఎన్.పాత్రుడు, బీఏ నాయుడు, గేదెల త్రినాథమూర్తి, సంతపాలెం ఎంపీటీసీ ఎన్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం



గంట్యాడ: కూటమి ప్రభుత్వం మోసాలను మహిళకు వివరిస్తున్న నరసింహమూర్తి, జైహింద్‌కుమార్



గజపతినగరం రూరల్: పి.ఎస్.ఆర్.పురంలో ప్రజలకు కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గంట్యాడ: నమ్మించి మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. మండ లంలోని పెణసాం, నీలావతి గ్రామాల్లో బుధవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేసి, కూటమి ప్రభు త్వం వాటిని అమలు చేసిందా అని మహిళలను ప్రశ్నించారు. ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని మహిళలు వారికి బదులి చ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బూట కపు హామీలు ఇవ్వడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిట్ట అని అన్నారు. ఇచ్చిన హామీలు అన్నీ నేరవేర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిది అయితే హామీలకు ఎగనామం పెట్టే చరిత్ర చంద్రబాబుది అని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, ఉపాధ్యక్షుడు వర్రి మల్ల య్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి జాగరపు సత్యారావు, గజపతినగరం నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఈదు బిల్లి రమేష్‌కుమార్, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కె. విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమిది అరాచక పాలన

గజపతినగరం రూరల్: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించి అరాచక పాలన సాగిస్తోందని జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు ఆరోపించారు. మండలంలోని పి.ఎస్. ఆర్.పురంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వివరించారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఏడాదిలోనే ప్రభుత్వం తీవ్రమైన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకలు కె.పైడుపునాయుడు, బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

యూరియాను అందుబాటులో ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

గుర్ల: అన్నదాతలు పొలం పనులు ప్రారంభిస్తున్నారని రైతు సేవా కేంద్రాల్లో, సొసైటీలలో ఎరువులు అందుబాటులో ఉంచాలని ఏవో తిరుపతిరావుకు ఎంపీపీ పొట్నూరు ప్రమీల సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. యూరియా అధిక ధరలకు కొనాల్సి వస్తుందని జమ్ము, తాటిపూడి సర్పంచ్‌లు గొర్లె నరసింహమూర్తి, అప్పలరాజు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అన్నదాత సుఖీభవ పథకానికి ఎక్కువ మందిని రైతులను అనర్హులుగా చూపిస్తున్నారని తహసీల్దార్ ఆదిలక్ష్మిని ఎంపీపీ ప్రశ్నించారు. రైతుల ఖాతా నంబరుకు ఆధార్ కార్డు లింక్ లేకపోవడం వల్ల అనర్హులుగా చూపిస్తుందని, రైతులు సచివాలయాల వద్ద ఖాతా నంబరుకు ఆధార్ కార్డు లింక్ చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు అంబల్ల లక్ష్మి, తోట తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, ఎంపీడీవో వరప్రసాద్ పాల్గొన్నారు.

టేకు దుంపల పంపిణీ

శృంగవరపుకోట: పట్టణంలోని గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ రైతులకు రాయితీపై టేకు దుంపలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా బుధవారం జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ కొన్నేళ్లుగా సామాజిక అడవుల పెంపకంలో భాగంగా టేకు దుంపలతో పాటు పలురకాల మొక్కలు రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, టేకు దుంపలు పెద్ద మొత్తంలో ఇవ్వాల్సి ఉన్నందున రాయితీపై అందిస్తున్నామన్నారు. ఆసక్తి గల రైతులు జియో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆలుగుబిల్లి గ్రామం సందర్శన

శృంగవరపుకోట: మండలంలోని ఆలుగుబిల్లి గ్రామాన్ని జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో తడిచెత్త, పొడిచెత్త సేకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో గమనించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలతో మాట్లాడి తడిచెత్త, పొడిచెత్త సేకరణ ఎలా జరుగుతోందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పుణ్యగిరి రోడ్డులో వైఎస్‌ఆర్ కాలనీలో జేజేఎం పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ లక్ష్మి, డీపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీఈఈ, ఎంపీడీఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

శాకంబరిగా ఎల్లారమ్మ



జామి: శాకంబరిగా దర్శనమిస్తున్న ఎల్లారమ్మ అమ్మవారు



శృంగవరపు కోట: కొత్తూరు గ్రామంలో శాకంబరిగా గ్రామదేవత పైడితల్లమ్మ

జామి: జామి ఎల్లారమ్మ అమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ఎండోమెంట్ సిబ్బంది, స్థానికులు, భక్తులు అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు గావించారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజాపక్షమే..

- చంద్రబాబు మోసాలను ప్రతి గడపకూ వివరిద్దాం
- వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజాపక్షమేనని, అధికారంలో ఉంటే ప్రజలకు సంక్షేమం అందిస్తామని, ప్రతిపక్షంలో ఉంటే ప్రజాగొంతుకై పాలకులను నిలదీస్తామని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు అధ్యక్షతన మండల కేంద్రంలోని నాయుడు ఫంక్షన్ హాల్‌లో ఆపార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వ హించారు. అతిథిగా హాజరైన అప్పలనరసయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి ఏడాది పాలన అంతా మోసం, నయవంచనే అని, ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదని విమర్శించారు.ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్‌తో పాటు వందల హామీలు ఇచ్చారని, వాటిలో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని అన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన సీఎం చంద్రబాబు ఏడాది పాలనలో లక్షా అరవై వేల కోట్ల రూపాయలు అప్పు చేశారన్నా రు.ఈ అప్పులతో ఏం చేశారో తండ్రీ, కొడుకులు రాష్ట్ర ప్రజలకు లెక్కలు చెప్పాలని నిలదీశారు. రాష్ట్రంలో కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్ ఇవ్వలేదు సరికదా ఉన్న పింఛన్లలో 5 లక్షలమందిని తొలగించిదని అన్నారు. నియోజకవర్గంలోని ఏ గ్రామం వెళ్లినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు, అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయి తప్ప కూటమి ప్రభుత్వంలో ఈశ మంతైనా అభివృద్ధి జరగలేదన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రతి గడపకూ వివరిద్దామని పిలుపునిచ్చారు. ఎంపీపీ చల్లా చల్లంనాయుడు మాట్లాడుతూ వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొట్లాం మాజీ సర్పంచ్ మీసాల తులసి ఇటీవల మర ణించడంతో సమావేశం ప్రారంభంలో అయిదు నిమిషాలు మౌనం పాటించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు ప్రభాజీరాజు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, వైస్ ఎంపీపీ జి.ఈశ్వరరావు, నాయకులు బోడసింగి జగదీష్ రావు, బొండపల్లి ఈశ్వరరరావు,గొల్లు సతీష్, ఎస్.పెంటంనాయుడు,ఎం.చలంనాయుడు,మహంతి రమణ, తదితరులు పాల్గొన్నారు

సచివాలయ ఉద్యోగుల సేవలు ఆదర్శనీయం



బదిలీ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు

చీపురుపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ పేద ప్రజలకు ఎంతో ఆదర్శనీయమైన సేవలు అందించాయని కర్లాం గ్రామ సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి అన్నారు. ఐదేళ్లుగా కర్లాం గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించి తాజాగా బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను బుధవారం సచివాలయం వద్ద సర్పంచ్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయ వ్యవస్థతో బాటు గ్రామ వాలంటీర్ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు ఇంటి వద్దకే అనుకున్న సమయానికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాణాన రామరత్నం, ఉప సర్పంచ్ కంది వరలక్ష్మి, గ్రామ పెద్దలు బాణాన శ్రీనివాసరావు, బాణాన రమణ, కెల్ల రామారావు, కంది ఈశ్వరరావు, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిల నిరసన



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థినులు, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

శృంగవరపుకోట: పట్టణంలోని గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహానికి ప్రహరీ ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కార్యాలయం దగ్గర విద్యార్థినులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పలువురు ప్రజా ప్రతినిధులు వచ్చి హామీలు ఇచ్చి వెళ్లారు కానీ ప్రహరీ నిర్మాణం చేయలేదన్నారు. ప్రహరీ లేక పోవడంతో బయటి వ్యక్తులు హాస్టల్ ఆవరణలోకి వచ్చి మద్యం తాగి సీసాలు వేయడం, బాలికలతో అసభ్యంగా ప్రవర్తిచడం చేస్తున్నారని, దీంతో తమకు రక్షణ లేకుండా పోయిందని, వెంటనే అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యురాలు పి.రత్న, జిల్లా ఉపాధ్యక్షుడు వి.చినబాబు, సభ్యులు వి.భారతి, జి.అనిత, శీల, శ్రీజ, తదితరులు పాల్పొన్నారు.

విద్యా ప్రమాణాల పరిశీలన

చీపురుపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పరిశీలనకు విజయనగరం ప్రభుత్వ డైట్ కళాశాల నుంచి ఇద్దరు అధ్యాపకులు బృందం మండలానికి వచ్చింది. ప్రభుత్వ డైట్ కళాశాలలో ఇంగ్లిష్ విభాగం అధ్యాపకుడు కె.అన్నారావు, సోషల్ విభాగం అధ్యాపకుడు పిరామారావులు మండలంలోని ఆంజనేయపురం, వంగపల్లిపేట, బస్టాండ్ ఏరియా ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ సంసిద్ధత, సిలబస్ ఎంత వరకు పూర్తయ్యింది, వర్క్‌బుక్స్ ఇతర కార్యక్రమాలకు సంబంధించి పరిశీలన జరిపారు. మూడు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. ఉపాధ్యాయులతో పలు అంశాలపై చర్చించారు. అంతేకాకుండా ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. పరిశీలన అనంతరం పూర్తి స్థాయిలో నివేదికను సమర్పించనున్నట్టు వారు స్పష్టం చేశారు.

విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

- కొత్తవలస హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు
- జనరల్ ఎన్నికలను తలపించిన ఎస్పీఎల్, సీపీఎల్ ఎన్నికలు



ఓట్లు వేసేందుకు బారులు తీరిన విద్యార్థులు

కొత్తవలస: విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని అప్పుడే భవిష్యత్తులో మంచి నాయకులుగా నిలుస్తారని కొత్తవలస హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు పాఠశాలలో ఎస్పీఎల్, సీపీఎల్ ఎన్నికలను బుధవారం నిర్వహించారు.ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికల తరహాలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా ఎన్నికల్లో నిలబడదలిచిన వారికి నామినేషన్‌లు వేయడం, ఎన్నికల ప్రచారం నిర్వహించడం, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సుల ఏర్పాట్లు, ఎన్నికల అధికారులు, పోలైన ఓట్ల లెక్కింపు అన్ని పూర్తిస్థాయిలో జనరల్ ఎన్నికలను మైమరిపించాయి. ఈ ఎన్నికల్లో ఎస్పీఎల్‌గా ఎస్.నిహారిక, కె.బాబిల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. నిహారికకు 187 ఓట్లు, బాబికి 164 ఓట్లు పోలయ్యాయి. ఎస్పీఎల్‌గా నిహారిక, సీపీఎల్‌గా బాబి ఎన్నికైనట్లు ఎన్నికల సిబ్బంది వెల్లడించారు. ఎస్పీఎల్‌గా ఎన్నికైన నిహారికకు ఉపాధ్యాయులు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందించారు. ఎన్నికలకు కొత్తవలస పోలీస్‌స్టేషన్ నుంచి మహిళా కానిస్టేబుల్స్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

గజపతినగరం: యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పత్తి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి(ఏఓ) పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మరుపల్లి, ఎం.గుమడాం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం రైతులకు రాయితీపై మినప,పెసర,మొక్కజొన్న విత్తనాలను అందజేశారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు విజయవాడ ప్రాంతీయ కార్యాలయం హడ్కో రూ.1,75,000 విలువైన ఫర్నీచర్‌ను సమకూర్చిందని హెచ్‌ఎం మీసాల వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు ఎస్.కిరణ్‌కుమార్ తమ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని హడ్కో అధికారులను కోరడంతో వారు స్పందించి 20 బెంచీలు,20 విద్యుత్ బల్బులు, 6 ఫ్యాన్‌లు, 20 టేబుళ్లు, 20ఎస్‌టైప్ కుర్చీలు అందజేశారు. హడ్కోకు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.